# విప్పిన బంగారు రెక్క — X

రచన:
శ్రీ. సయ్యదు అహమ్మద్.

దూర ప్రయాణం చేసి బాగా అలసిపోయినందువల్ల చప్పున నిద్రపట్టింది కానీ, ఇంతలో ఆ లౌడ్ స్పీకర్ చప్పుడుకు మెలుకువ వచ్చింది. మళ్ళీ ముసుగు తన్ని పడుకొని, ఇంకాసేపు నిద్రపోదామని ప్రయత్నించాను. ఎటుతిరిగి పడుకున్నా పక్క కుదరలేదు. ఎంత ప్రయత్నించినా నిద్ర పట్టలేదు. తాష్కెంట్ రేడియో ఎనౌన్సర్ గొంతుక బదులు, ఎవరిదో ఎలుగురాసిన గొంతుక వినుపిస్తున్నది:

“సమిష్టి క్షేత్రపు రేడియో కేంద్రం యిది! పాద్మన్ బాయ్-అతా గారి ఇంటివద్ద ఇవ్వాళ ఒక వివాహం జరుగబోతున్నది. కాబట్టి పని దినం పూర్తికావటం తోటే మీరు యావన్మందీ యీ వివాహ మహోత్సవానికి రావాలని కోరుతున్నాము. దళ నాయకులు తమ దళాలకు చెందిన ఔత్సాహిక గాయకులను పని నుండి రెండు గంటలు ముందుగా విడిచిపెట్ట వలసినదిగా విజ్ఞప్తి చేస్తున్నాము. ఇందుకు మేము సమిష్టి క్షేత్రాధ్యక్షుని అనుమతి పొందాము...భోజన విరామ సమయంలో సమిష్టి క్షేత్ర సభ్యులను తనను వచ్చి కలుసుకొనమని అత్తయ్య ఖలీఫాగారు చెబుతున్నారు. నేటి తెల్లవారు జామున నే ఆమె కుమారుడు అజమ్ద్జాన్, సోవియట్ సైన్యం నుంచి విడుదలై ఇంటికి వచ్చారు. పెన్షన్ మీద వుంటున్నవారిని ఖలీఫా అత్తయ్యగారు కాస్త త్వరగా రమ్మని కోరుతున్నారు. పులావ్ కు కాస్త క్యారట్లు, మాంసం తరిగి పెట్టటంలో యీ పెద్దలు ఆమెకు సాయపడాలని ఆమె మరీ కోరుతున్నారు. వినండి—మన పంట కోతల సంఘాధ్యక్షుడు మాట్లాడబోతున్నారు...”

మళ్ళీ లౌడ్‌స్పీకర్లోనుంచి పెద్ద చప్పుడైంది. ఎవరో దగ్గుతున్నట్టుగా వుంది. మరీ బిగ్గరగా కూడా మాట్లాడుతున్నారు:

“బుర్ఖానాదిన్, వింటున్నావా? మీరు పంట కోతల సంఘ కార్యాలయానికి రావలిసిన అగత్యంలేదు. సరాసరి రైల్వే స్టేషన్ కు వెళ్ళి అక్కడి పని చూసుకోవాలి. రాత్రి మనకు సురేకారం బస్తాలు పంపబడ్డాయి. ఒక కంద సంచులు పట్టించుకరావాలి. వాటి బరువూ, సురేకారం ఎట్లావున్నదీ—ప్రతిదీ సరిగ్గా చూచాక సరుకు విడుదల చేసుకోవాలి. సరేనా? ముయరిఫ్, నిన్న మీరు పనికిరాలేదు దేనికి? ఇట్లా పని ఎగవెయ్యటం సబబు కాదు. ఇవ్వాళ పొలానికివచ్చి నన్ను పొలంలో కలుసుకొనకపోతే, ఇహ మీరు పనికిరావలసిన అవసరం లేదు. ఏ సభ్యుడేగాని ఇట్లా సోమరిగా, బాధ్యతా రహితంగా ప్రవర్తిస్తే మేము చూస్తూ ఊరుకోటం సబబు కాదు. అవునా?”

ఆ పంట కోతల సంఘాధ్యక్షుడు మళ్ళీ పెద్దగా దగ్గి, గొంతు సవరించుకున్నారు. ఇంతలో అడుగుల చప్పుడైంది. ఎవరో వస్తున్నట్టుగావుంది. మళ్ళీ ఎనౌన్సర్ గొంతు:

“శ్రోతల్లారా వినండి! చాయ్ ఖానాలో బల్లమీద చేతి గడియారం విడిచిపెట్టి వెళ్ళిన వ్యక్తి, దానిని రేడియో స్టేషన్ కు వచ్చి తీసుక వెళ్ళాలి. అది పోలేదు. ఇవ్వాళ సేవింగ్స్ బ్యాంక్ ను 2 గంటలకల్లా మూస్తారు. డబ్బు తీసుకోవలసన వాళ్ళు, వేసుకోవలసిన వాళ్ళు ఆలోగా వెళ్ళటం మంచిది. ఇవ్వాళ ఫోటోగ్రాఫులు తీసే ఆయన వచ్చారు. పెద్ద పెద్ద ఎన్లార్జిమెంటు కావాలన్నా, రూపచిత్రాలు కావాలన్నా ఆయన తయారుచేసి పెడతారు. వివరాలు కావలసిన వాళ్లు గ్రంథాలయంలో తెలుసుకోవచ్చు...మద్యపాన నిషేధాన్ని గురించిన ఉపన్యాసం, ఇవాళటి కార్యక్రమం రాత్రి 8 గంటలకు జరుగుతుంది. పాద్మన్ బాయ్-అతా గారి పెండ్లికదూ ఇవ్వాళ, దానికోసం యీ కార్యక్రమం మార్పు చెయ్యబడ్డది. రేపు రాత్రి, ఉపన్యాస కార్యక్రమం తరువాత కొత్త సంగీత చిత్ర ప్రదర్శన జరుగుతుంది. ఈ చిత్రం పేరు ‘ఆశ్చర్యం.’ ఉపన్యాసానికి అంతా కార్యక్రమం మొదలు కాక పూర్వమే రావాలి. ప్రశ్నలు అడగదలచుకుంటున్న వాళ్లు ముందుగానే ఉపన్యాసకుడికి వాటిని ఇవ్వటం మంచిది. దానివల్ల కాలం వృధాకాదు. గతూర్ గుల్యామ్ నవల నాల్గవ భాగం—మన పుస్తక విక్రయశాల కొచ్చింది. ఈ ప్రతులు అయిపోక పూర్వమే కావలసినవాళ్లు తొందరగా కొనుక్కోవటం మంచిది. పొరుగు గ్రామాల

రైతులు అప్పుడే యీ నవల కోసం వస్తున్నారు... ఇంకొక విషయం. మన క్షేత్రపు గడ్డి వామి దగ్గర నిన్న కొంత మంది బాలలు చేరి చాలాసేపు ఆట లాడారు. కానీ వాళ్లు దానిని తగులబెట్టేటంత పని చేశారు. కొద్దిలో ఆ ప్రమాదం తప్పిపోయింది. పిల్లల యీ అల్లరి సహించదగ్గది కాదు. తమ పిల్లలు తప్పుదారి తొక్కకుండా తలి దండ్రులు వాళ్ళను అదుపులో పెట్టాలని హెచ్చరిక చేస్తున్నాము.''

ఇంతలో మళ్ళీ లౌడ్ స్పీకర్ రెపరెపలాడినట్టు చప్పుడు చేసింది. గాయకులెవరో చెప్పలేదు కానీ సంగీత కార్యక్రమం ప్రసారమవుతున్నది.

నేను పక్కమీద నుంచి లేచి, కిటికీ దగ్గరకు వెళ్ళి చూచాను. రాత్రి చీకట్లో ఈ పరిసరాల్లో నేను దేనినీ సరిగ్గా చూడలేదు. ఇప్పుడు కిటికీలోనుంచి చూస్తుంటే దగ్గర్లో ఒక నది—ఉరవడిగా ప్రవహిస్తున్నది. ఒడ్డున వున్న చెట్లను ఒరుసుకుంటూ ప్రవహిస్తున్నది ఆ నది. చెట్ల కొమ్మల సందులలో నుంచి మరికాస్త ముందుకు చూస్తే—అల్లంత దూరాన ఒక సరోవరం ఉన్నది. సూర్యోదయమై ప్రతిదీ మరికాస్త ప్రకాశవంతంగా స్పష్టంగా కనిపించసాగింది. బూరుగు చెట్లు మరీ తళతళ లాడుతున్నాయి. పారదర్శకాలైన ఆ చెట్ల ఆకులూ, కొమ్మలూ మానులతో నుంచి వెలుగు దివ్యంగా ప్రసరిస్తున్నది.

ఒక కొండమీద సమిష్టి క్షేత్రపు హోటల్ ఉన్నది. దిగువన గ్రామం ఉన్నట్టుంది. ఆ హోటల్ పొగ గొట్టాలలోంచి ధుమధుమ లాడుతూ వలయాలు వలయాలుగా వస్తున్నది పొగ. గాలి కెరటాల మీదనుంచి కమ్మగా, కాలుతున్న కేకులవాసన వస్తున్నది. ఇంకా కొన్ని ఇండ్లు కట్టబడుతున్నాయి అక్కడ. కట్టిన ఇండ్లు బారుగా ముచ్చటగా ఉన్నాయి.

ఇంతలో బాతుల చప్పుడు వినిపించింది. ఎండ ఎక్కుతున్నది. రోడ్డు నీలంగా—అందంగా వంకలు తిరుగుతూ కనుపించింది. ఆ ఇండ్ల మధ్యన అక్కడక్కడా బూరుగు చెట్లు పందిళ్ళు వేసినట్టుగా ఉన్నాయి. పచ్చని పొలాలు దూరాలకు విస్తరించి దిజ్మండలాన్ని తాకుతున్నట్టున్నాయి. రోడ్లమీద జనం నడవడమూ ఎక్కువైంది. ఊరంతా మేలుకున్నట్టుగా వుంది. కప్పుమీద పావురాళ్ళు ఎగురుతూ కిలకిలమంటున్నాయి. రాత్రంతా తెరిపిలేకుండా వినిపించిన డీసెల్ ఇంజన్ సద్దు మణిగి నట్టుంది. వీధి దీపాలిన్నీ ఆరిపోయ్యాయి. నేను నా హోటల్ గదిలోంచి బయలుద్దేరి చాయ్‌ఖానా వైపు నడక సాగించాను. త్రోవలో కడవలనిండా ద్రాక్ష పండ్లు నింపుకొని వెళ్ళుతున్నవాళ్ళు కొందరు కనిపించారు. కొంతమంది మహిళలు నెత్తిన గంపలు పెట్టుకొని వెళ్లుతున్నారు.

నటికి ఎడమ పక్క నేక్లబ్బు భవనం ఉన్నది. దానికి కుడివైపుదే మార్కెట్టు. అక్కడ చదునుగా వుండే ప్లేన్ చెట్టు నీడన, బహిరంగ స్థలంలో చాయ్‌ఖానా ఉన్నది. ఈ చెట్టు ఆకులు తాటి ఆకులలా అంతలేసిగా ఉన్నాయి.

పులిక్రీము, చదును కేకులు ఇప్పించుకొని, నేను, ఉదయపు టీ తాగుతున్నవాళ్ళ దగ్గరకు వెళ్ళి కూర్చున్నాను.

పైన ఒక పరిగ కిచకిచమంటూ చెట్టు ఆకును కదలించింది. ఆ ఊపుకు ఒక నీటిబొట్టు నామీద పడ్డది. తల పైకెత్తి చూతునుకదా ఆ పరిగ పిట్ట, ఒక బోను కనుపించాయి. ఈ దృశ్యం నాకు కాస్త ఆశ్చర్య మనిపించింది. ఈ చెట్టు—ఇటువంటి కొమ్మ — ఎక్కడ చూచానా అని ఆలోచించుకున్నాను. ఎంతకూ స్ఫురణకు రాలేదు. దిగువనుంచి చూస్తే ఆ ఆకు బంగారు గరుడ పక్షి రెక్క విప్పార్చినట్టుగా వుంది.

చటుక్కున జ్ఞాపకం రావలసినది జ్ఞాపకం రాకపోతే ఎవరికైనా విసుగుపుడుతుంది. విసుగేకాదు, తనమీద తనకే అసహ్యం పుట్టుకొస్తుంది. మనస్సు నిశ్చలంగా ఏ విషయాన్నీ అటువంటప్పుడు ఆలోచించలేకపోతుంది. నేను ఇంతకు మునుపు ఇటువంటి చెట్టును చూచినది ఎక్కడ? అదే నన్ను వెన్నాడుతున్న ప్రశ్న. ఎక్కడ?

అవును. నా చిన్నతనంలో నేను, భూసార పరిశోధకుల దళాలతోటీ, చారిత్రక త్రవ్వకాలను కొనసాగిస్తున్న వాస్తు శాస్త్రజ్ఞులతోటీ వేసవి సెలవులలో పర్యటనలు జరుపుతుండేవాడిని. మార్గెలన్‌లో ఒక చాయ్‌ఖానా దగ్గర ఇటువంటి చెట్టే, పైన్ చెట్టును చూచానన్న సంగతి ఇప్పుడు జ్ఞాపకం వచ్చింది. అక్కడే, ఫెర్ఘానా కాలువ డిజైనింగ్ ఇంజనీర్లనుకూడా అప్పుడు కలుసుకున్నాను. వాళ్ళతోపాటు పని చెయ్యటానికి

నేనూ వెళ్ళారు. నాకై నేను ఆ పనిలో ప్రవేశించాను అసలు. మేము ఆ స్టెప్పీ ప్రాంతంలో కొంతదూరం వెళ్లాము. కొంత కాలి నడకన, కొంతదూరం గుర్రాల మీద ప్రయాణం చేశాము. ఇట్లా వందలకొలది కిలోమీటర్ల దూరం ఆ స్టెప్పీలో ప్రయాణం చేశామంటే నమ్మండి. ఎండ మిటమిటలాడిపోతుంటుంది ఆ ప్రాంతమంతటా.

మూడు రోజులపాటు-ఒకమాటు దారితప్పి—హడలిపోయ్యాను. ఇప్పుడు యీ చెట్టు నీడన కూర్చొని గతం నెమరువేసుకుంటుంటే ఎందుకో ఆ సంగతులు జ్ఞాపకం రాసాగాయి. ఇది యీనాటి సంగతా? ఊహూ! ఆ చెట్టేనా ఇది? ఊహూ-అసంభవం. ఆ రోజులలో పైన్ చెట్టు చుట్టూతా కళ్ళు పొడుచుక చూచినా ఎక్కడా ముండ్లపొదలతప్ప మరొకటి లేదు. సరేనని—టీ కప్పు అవతల పెట్టి యీ చాయ్‌ఖానా పరిసరాలను పరిశీలనగా చూడ మొదలుపెట్టాను. నా కళ్ళను నేను నమ్మలేక పోయినాను. ఆ చెట్టు మానుమీద అప్పుడు నేను చెక్కిన నా పేరున్నది. రహదారిన కొంతదూరం నడిచాను. కొండమీదనుంచి హోటల్ భవనం కనుపిస్తున్నది. అప్పుడు ఊసరవిల్లిని చూచి భయపడిపోయి నేను దాక్కున్న కొండకూడా సరిగ్గా అదే. కొంతదూరం ప్రవాహం వొడ్డునే నడిచేసరికి కాలువ తగిలింది. అక్కడ వాతావరణం చాలా చల్లగా వుంది. గాలి నిర్మలంగా వుంది. కొత్తగా కట్టిన ఇళ్ళను చూచేసరికి సంతోషమూ, ఆశ్చర్యమూ నాలో పొంగులెత్తుకొచ్చాయి, మేము ఒకమాటు సరిగ్గా యీ ప్రాంతంలోనే రొంపిలో దిగబడిపోయినాము. ఇప్పుడు దీనికి చేరువలోనే చక్కటి సరస్సు వున్నది. సమిష్టి క్షేత్రపు బాతులు హాయిగా యీ సరోవరంలో ఈదులాడుతున్నాయి. గుర్తుపట్టరానంతగా మారిపోయింది యీ చోటు. అంతా కొత్తగా ఉన్నది.

ముండ్ల కంచల మయంగా వున్న ఈ నేల, ఇప్పుడు-ఈనినట్టుగా వుంది ఇప్పుడు ఇక్కడ నడుస్తుంటే మా కట్టు గుడ్డలుకూడా బదాబదలుగా చిరిగిపొయ్యాయి. ఇంత అందమైన తోటను ఎట్లా వేశారో?

ఈ ప్రాంతాలకు సస్యాన్నీ, సమృద్ధినీ తీసుకవచ్చిన ఆ ఇంజనీర్ల కృషి ఎంత గొప్పదో ఇప్పుడు నాకు కళ్ళకు కట్టినట్టయింది. ఎన్ని కష్టాలుపడి వాళ్ళు ఈ ప్రాంతాలకు నీళ్ళను మళ్ళించారో చెప్పలేము. నిజంగా వాళ్ళ చేతులు—వాళ్ళపని అబ్బురమనిపిస్తున్నది.

ఈ చోట్లకు నివాసార్థం మొట్టమొదటగా వచ్చిన వాళ్ళతో నేను రానందుకు ఎంతో విచారం కలిగింది నామటుకు నాకు. ఈ గ్రామంలో వుండి—రేపు, ఇక్కడి ప్రాతః సౌందర్యాన్నీ, సాయం శోభనూ ఈ కళ్ళతో ఒకమాటు చూచితీరాలని నిశ్చయించుకొన్నాను.

సాయంత్రం ప్లేన్ చెట్టుదగ్గర కెళ్ళి కాసేపు దాని నీడన కూర్చున్నాను. పెండ్లికూతురుతోపాటు మేళతాళాలతో కొంతమంది ఊరేగింపుతో వెళ్ళారు. కొంతసేపటికి మేళతాళాల చప్పుడు సన్నబారింది. ఈపాటికి పెళ్ళికొడుకు కూడా, పెళ్ళికుమార్తె ఇంటికి చేరుకొని వుండొచ్చు. ఇంతలో పక్షి ఈకెలు, రకరకాల దుస్తులు, కుర్చీలు, పెద్ద పెద్ద అద్దాల బీరువాలతో ఒక లారీ, పెళ్ళికూతురు ఇంటివైపు వెళ్ళింది.

ఎర్రటి అస్తమయ సూర్యబింబం సరోవరపు ఉపరితలంమీద కనుపిస్తూ—స్నానమాడుతున్నట్టుగా వుంది. ఆ కొండలు, బంగారు పంటల కుప్పలతో వున్న ఆ పొలాలు—దూరాలనుంచి ఆడపిల్లల కిలకిలారవాలు—ఈ దృశ్యం మనోహరమనిపిస్తున్నది. పెండ్లికూతుర్ని పెండ్లికుమారుడి ఇంటికి పంపుతున్నట్టున్నారు, అంపకాలు.

రాత్రి, వీధులన్నీ దీప తోరణాలతో తళతళలాడాయి. కొంతదూరంనుంచి డప్పులు, మేళాలు, తాళాలు వినిపిస్తున్నాయి. బూరుగు చెట్లమధ్యనుంచి దూరాన ఒక కొత్త ఇంటిముందు పెండ్లివారు వేసిన శిబిరపు మంటలు కనుపిస్తాయి. గరుడపక్షి బంగారు రెక్క విప్పినట్టుగా వుంది. అంతటా చల్లటి గాలి ఆ గ్రామాన్నే ఉయ్యెలలో ఊపుతున్నట్టుగా వుంది.

Edited and Published by A. N. Raghavachar, No, 32, Krisnappa Naick Tank St., Madras-1.
Printed by V. Kuppuswamy Chetty, Bharathamatha Press, No. 39, AndersonSt., Madras-1.